## క్లుప్తంగా

### పర్కోలేషన్ ట్యాంకు పనుల పరిశీలన



ఎల్లారెడ్డిరూరల్: మీసాన్‌పల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీవో ప్రకాష్ మంగళవారం పరిశీలించారు. గ్రామ శివారులో ఉపాధిహామీ పనులలో భాగంగా చేపట్టిన పర్కోలేషన్ ట్యాంకు పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పనులకు కూలీల సంఖ్య పెరిగేలా చూడాలని ఏపీవోకు సూచించారు. ఏపీవో వినోద్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులున్నారు.

### వంద శాతం పన్నులు వసూలు చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని డీఆర్‌డీవో సురేందర్ ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. పన్నులు చెల్లిస్తేనే గ్రామాల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పన్నుల వసూలుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామి పథకంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనులు నాణ్యతగా చేపట్టేలా చూడాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, ఆయా గ్రామాల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

### 'పంటల అధిక దిగుబడికి పీఎస్‌బీ వాడాలి'



కామారెడ్డి అర్బన్: పంటల అధిక దిగుబడికి పీఎస్‌బీ బయో ఎరువులను వినియోగించాలని కామారెడ్డి ఏడీఏ అపర్ణ అన్నారు. మండలంలోని గర్గుల్‌లో పీఎస్‌బీ వాడకంపై రైతులకు వివరించారు. పీఎస్‌బీని దుక్కిలో లేదా, వరి నాటు వేసిన వారం రోజుల్లో ఇసుక లేదా వర్మి కంపోస్టు ఎరువులతో కలిపి వాడాలని సూచించారు. ఏఈవో ప్రతిమ, సింగిల్‌విండో మాజీ చైర్మన్ కొల్మి భీంరెడ్డి, రైతులు రాజిరెడ్డి, స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### మండల సమాఖ్య అధ్యక్షురాలిగా పావని



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండల సమాఖ్య అధ్యక్షురాలిగా పావనిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏపీఎం ప్రసన్నరాణి మంగళవారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మండల సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆమె తెలిపారు. కార్యదర్శిగా జ్యోతి, కోశాధికారిగా అనితలను ఎన్నుకున్నట్లు చెప్పారు. నూతన కార్యవర్గ సభ్యులతో బ్యాంకు లింకేజీ మేనేజర్ రవీందర్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు.

### గర్గుల్ పాఠశాలలో సైన్స్ ఫెస్ట్

కామారెడ్డి అర్బన్: గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ ఫెస్ట్ నిర్వహించారు. పాఠశాల స్థాయిలో చక్కని సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని డీఈవో రాజు అన్నారు. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు బాలగంగాధర్ రూపొందించిన ఆటోమేటిక్ బెల్ ప్రతి 45 నిమిషాలకు గంట కొడుతుందని హెడ్‌మాస్టర్ ఎల్లయ్య వివరించారు. ఫెస్ట్‌లో భాగంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, బయోసైన్స్, ఇతర ఉపాధ్యాయులు సుస్మిత, దయానంద్, వీరబ్రహ్మం, శ్యామ్ పాల్గొన్నారు.

### ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. సోమవారం నాటికి 3 లక్షల 15 వేల 239 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ప్రమాదకరంగా లోలెవెల్ బ్రిడ్జి



గాంధారి-బూర్గుల్ రోడ్డులోని లోలెవల్ బ్రిడ్జి



బ్రిడ్జి వద్ద ధ్వంసమైన రోడ్డు



పైపులైన్లు తవ్వడంతో ఏర్పడిన గుంతలు

- బ్రిడ్జి వద్ద రోడ్డు ధ్వంసమై ఏర్పడ్డ గుంతలు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పలు తండాలకు వెళ్లే రోడ్లు, లోలెవల్ బ్రిడ్జి, కల్వర్టులు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. గాంధారి నుంచి బూర్గుల్ వెళ్లే మార్గంలో గాంధారి–బొప్పాజువాడి మధ్యలో వాగుపై లోలెవల్ బ్రిడ్జి ఉంది. వర్షాకాలంలో చాలా సార్లు బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహించినప్పుడు రాకపోకలు నిలిచి పోతాయి. బ్రిడ్జి వద్ద రోడ్డు ధ్వంసమై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే బ్రిడ్జి వద్ద గతేడాది ప్రమాదం జరిగి బొప్పాజువాడికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. అయినా రోడ్డుకు మరమ్మతులు చేయడం లేదు. ఈ రోడ్డుకు ఇరువైపులా దారి పొడవునా వ్యవసాయ భూములున్నాయి. రోడ్డును పలుచోట్ల తవ్వి రైతులు పైపులైన్లు వేసుకున్నారు. దీంతో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. గుంతల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. బూర్గుల్ నుంచి పంతులునాయక్ తండాకు వెళ్లే రోడ్డు ఒర్రె వద్ద రోడ్డు ధ్వంసమై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవలే ప్రమాదం జరగడంతో పంతులు నాయక్ తండాకు చెందిన ఓ వ్యక్తి గాయాలై మూలన పడ్డాడు. బూర్గుల్ నుంచి పంతులునాయక్ తండాకు సుమారు 4 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రోడ్డు పాడైన కారణంగా తండాకు ఆటోలు రావడంలేదు. దీంతో మహిళలు, విద్యార్థులు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు రోడ్డును పరిశీలించి మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### మరమ్మతులు చేపట్టాలి



రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రతి విషయానికి మండల కేంద్రానికి రావాల్సి ఉంటుంది. గుంతల మయమైన రోడ్లపై ప్రయాణం ఇబ్బందిగా ఉంది. తరచూ ప్రమాదాలు జరిగి బాధితులు ఆస్పత్రుల పాలవుతున్నారు. పంతులు నాయక్ తండాకు ఆటోలు కూడా రావడంలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బూర్గుల్ వరకు నాలుగు కిలోమీటర్లు నడిచి వస్తున్నారు.

– కిషన్, మాజీ సర్పంచ్, బూర్గుల్ తండా

### వర్షాకాలంలో అంతరాయం



మండల కేంద్రానికి రావాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. రోడ్డు చాలా చోట్ల ధ్వంసమైంది. లోలెవెల్ బ్రిడ్జి చాలా ప్రమాదకరంగా తయారైంది. వర్షాకాలంలో వరద బ్రిడ్జిపై నుంచి ప్రవహించినప్పుడు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏదైనా అత్యవసర పని ఉంటే చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నాము. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

– జీవన్, మాజీ సర్పంచ్, సోమ్లానాయక్ తండా

### ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

గాంధారి(ఎల్లారెడ్డి): రేపు జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ సతీష్ రెడ్డి, ఎస్సై ఆంజనేయులు మంగళవారం పరిశీలించారు. గిర్దావర్ ప్రదీప్, సిబ్బంది ఉన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ గంగాసాగర్ తెలిపారు. మండలంలో 692 మంది పట్టభద్రులు, 54 మంది ఉపాధ్యాయులు ఉన్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.



గాంధారి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

### సమాచారం..

**మోడల్ స్కూల్ దరఖాస్తు గడువు పొడగింపు**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): స్థానిక మోడల్ స్కూల్‌లో ప్రవేశం పొందటానికి గడువును పొడగించినట్లు ప్రిన్సిపాల్ రాజిరెడ్డి తెలిపారు. 6వ తరగతితో పాటు 7–10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 28 వరకు గడువు ఉండగా, ఆ గడువును మార్చి 10 వరకు పొడగించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీల విద్యార్థులు రూ.125 చెల్లించాల్సి ఉంటుందన్నారు.



నాగిరెడ్డిపేట: ముస్తాబైన త్రిలింగరామేశ్వరాలయం



సంతాయిపేట్‌లోని భీమేశ్వరాలయం



కృష్ణాజీవాడిలోని రాజరాజేశ్వరాలయం

# శివరాత్రికి ఆలయాల ముస్తాబు

మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాలు అందంగా ముస్తాబయ్యాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో శివాలయాలను రంగులు వేసి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. మిరుమిట్లు గొలిపేలా విద్యుత్ లైట్లతో అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పండుగ సందర్భంగా పలు ఆలయాల వద్ద పెద్ద ఎత్తున జాతరలు వెలిశాయి. అన్నదానాలు చేసేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. నాగిరెడ్డిపేట మండలం తాండూరులోని త్రిలింగ రామేశ్వరాలయం, లింగంపేట మండలం కొర్పోల్‌లోని శివాలయం, ఎల్లారెడ్డి పట్టణంలోని నీలకంఠేశ్వరాలయం, దోమకొండలోని శివరాంమందిర్, నస్రుల్లాబాద్ మండలం దుర్కిలోని సోమలింగేశ్వర ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



భిక్కనూరులోని సిద్దరామేశ్వరాలయ ప్రాంగణం



ఎల్లారెడ్డి పట్టణంలోని నీలకంఠేశ్వరాలయం

### వైభవంగా శివపార్వతుల కల్యాణం



కామారెడ్డి రూరల్: దేవునిపల్లి శివాలయంలో మంగళవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణల మధ్య వివాహం జరిపించారు. కట్నకానుకలు సమర్పించారు. అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక హోమం చేపట్టారు. అనంతరం శివభిక్ష కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

## శివుడు, రాముడు కొలువైన శివరాంమందిర్

- 500 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం
- నేడు మహాశివరాత్రికి ముస్తాబు

దోమకొండ: దోమకొండలోని శివరాంమందిర్ ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉంది. శివుడు, రాముడు ఒకేచోట కొలువు కాగా, శివరాంమందిర్ అని ఆలయానికి పేరు వచ్చింది. దీనిని 500 ఏళ్ల క్రితం నిర్మాణం చేసినట్లు ఆధారాలున్నాయి. గ్రామానికి చెందిన పెద్దయ్య, చిన్నయ్యలు కలిసి ఆలయాన్ని నిర్మించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. పెద్దయ్య శివాలయం నిర్మించగా, చిన్నయ్య రామాలయాన్ని నిర్మించారు. అనంతరం ఇద్దరు ఆలయ ఆవరణలోనే జీవసమాధి అయినట్లు చెబుతున్నారు. ఇక్కడి స్పటిక లింగం చాలా మహిమ కలదని భక్తుల నమ్మకం. ఆలయ అభివృద్ధికి గడికోట సంస్థాన వారసులు కృషి చేశారు. ఆలయంలో ప్రతి శివరాత్రి రోజున పెద్ద ఎత్తున అభిషేకాలు నిర్వహిస్తారు. శివరాత్రి రోజున ప్రత్యేకంగా మహరాష్ట్రలోని ఇంగోళి ప్రాంతం వారు తయారు చేయించిన బాణాసంచా కాలుస్తారు. శివుడికి, రాముడికి ప్రత్యేకంగా తయారు చేయించిన రథాల్లో వారి ప్రతిమలను పెట్టి తాళ్లతో యువకులు లాగుతారు. వారం రోజుల పాటు ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. దోమకొండతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు పెద్ద ఎత్తున ఇక్కడికి వస్తారు.



దోమకొండలోని శివరాం మందిర్

## సంక్షిప్తం

**కంపోస్టు షెడ్డు పరిశీలన**



లింగంపేట(ఎల్లారెడ్డి): రాంపూర్ శివారులో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్డును మంగళవారం ఎంపీవో మలహరి పరిశీలించారు. కంపోస్టు షెడ్డులో తయారు చేస్తున్న ఎరువులు పంట చేలకు సేంద్రియ ఎరువులుగా ఉపయోగపడతాయని, కంపోస్టు ఎరువులు తయారు చేయడానికి రైతులు ముందుకు రావాలన్నారు.

**వన నర్సరీలు..**

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని వన నర్సరీలను మంగళవారం స్థానిక ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. వన నర్సరీల్లో చెట్ల పెంపకం కోసం చేపడుతున్న పనులు, నీటి సంరక్షణపై ఈజీఎస్ సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామాల్లో నిర్మించిన కంపోస్ట్ షెడ్లను ఉపయోగంలోకి తీసుకోవాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆయన సూచించారు.



**రాజంపేట పీహెచ్‌సీలో 'ఆరోగ్య మహిళ '**



రాజంపేట: రాజంపేట పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ విజయ మహాలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 54 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి మందుల అందజేశామన్నారు. అలాగే ఆరోగ్యంపై తగు సూచనలు చేశామని తెలిపారు.

**సైన్స్ మేళా పరిశీలన**



బాన్సువాడ: బీర్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకన్న అధ్వర్యంలో మేళా కొనసాగింది. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాలల ఉపాధ్యాయులు రాధాకృష్ణ, శివరాం, దశరథ్, మల్లీశ్వరి, భరత్, సోమేశ్వర్, ఉదయ్, రామాంజనేయులు, జయశ్రీ, గంగామణి, ప్రసాద్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# అమరుల కుటుంబాలకు రుణపడి ఉంటాం


- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): జాతి ప్రయోజనాలు, హక్కుల సాధన కోసం చేపట్టిన పోరాటాల్లో అసువులు బాసిన అమరవీరుల కుటుంబాలకు మాదిగ జాతి జీవితాంతం రుణపడి ఉంటుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో టూరిజం ప్లాజాలో మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన జరిగిన మాదిగ అమరవీరుల సంస్మరణ సభలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పాల్గొని మాట్లాడారు. తాను మాదిగ శాసనసభ్యుడిగా ఉన్నందుకు గర్వపడుతున్నానని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన కృషిని మాదిగలు ఎన్నటికీ మర్చిపోలేరన్నారు.



అమరుల కుటుంబాలకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తోట, పక్కన మంత్రి రాజనర్సింహ

### వైన్స్ దుకాణాల మూసివేత



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలో వైన్స్ దుకాణాలను మూసి వేయించినట్లు ఎక్సైజ్ అధికారులు మంగళవారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా 48 గంటల పాటు మద్యం దుకాణాలను సీజ్ చేస్తున్నట్లు వారు చెప్పారు. 25న సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేది 4 గంటల వరకు మద్యం దుకాణాలు మూసి ఉంచుతామన్నారు.

### వినియోగంలోకి ఏటీఎం



సాక్షి ఎఫెక్ట్..

రాజంపేట: సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'ఏటీఎం బాగు చేయించరూ' కథనానికి మంగళవారం ఎస్‌బీఐ ఏటీఎం నిర్వాహకులు స్పందించారు. మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెచ్చారు. ఖాతాదారులు హర్షం వ్యక్తం చేశారు.

# చదువే సకల సమస్యలకు పరిష్కారం

మాచారెడ్డి: చదువే సకల సమస్యలకు పరిష్కారమని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. మంగళవారం మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన స్పోర్ట్స్, వీడ్కోలు, వార్షికోత్సవ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. చదువుతో జ్ఞానం, హోదా, గౌరవం వస్తాయని విద్యార్థులకు సూచించారు. ఈ సారి కష్టపడి చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యాఖినొద్దీన్, క్రీడల ఇన్‌చార్జి నర్సింలు, అధ్యాపకులు సుజాత, తిరుపతి, శ్రీనివాస్, జయంత్, సాయిబాబా, రామకృష్ణ ప్రభాకర్ ఉన్నారు.



మాచారెడ్డిలో మాట్లాడుతున్న నోడల్ అధికారి

### టోల్ ప్లాజా కార్మికులను పనిలోకి తీసుకోవాలి



కామారెడ్డి టౌన్: భిక్కనూరు టోల్‌ప్లాజాలో తొలగించిన కార్మికులను తక్షణమే పనిలోకి తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా అసిస్టెంట్ కార్మికశాఖ అధికారి కోటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తొలగించిన పీఎఫ్, ఈఎస్ఐ కలిగిన 38 మందిని తక్షణమే తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు చేస్తామన్నారు. సీఐటీయూ నాయకుడు రాజనర్సు, టోల్‌ప్లాజా సిబ్బంది నర్సాగౌడ్, రాజేశేఖర్, ప్రభాకర్, రాజు, నరేష్ తదితరులున్నారు.

### ఘనంగా ఉర్సు



బీబీపేట: మండల కేంద్రం సమీపంలోని పెద్ద చెరువు కట్టపై ఉన్న సయ్యద్ సాహెబ్ దర్గా వద్ద ముస్లింలు మంగళవారం ఉర్సును వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా ఉర్సు నిర్వహించినట్లు నిర్వాహకులు సయ్యద్ తాలే అలీ షా ఖాద్రి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గంధం, పూలు, బట్టలు లాంటివి ప్రధాన వీధుల గుండా ప్రార్థనలతో తీసుకెళ్లి అలంకరించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన భక్తులకు భోజనాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

## 'అడవులను కాపాడాల్సిన బాధ్యత మనందరిది'

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అడవులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవికుమార్ సూచించారు. తాండూరు శివారు అటవీప్రాంతంలో తరుచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీప్రాంతంలో ఎక్కడ నిప్పు కనబడినా వెంటనే తమకు సమాచారం ఇవ్వడంతోపాటు నిప్పును ఆర్పే ప్రయత్నం చేయాలన్నారు. దీంతోపాటు పశువుల కాపర్లతో పాటు గొర్ల, మేకల కాపర్లు అటవీప్రాంతంలో బీడీలు, సిగరెట్లు కాల్చవద్దని చెప్పారు. బీట్ ఆఫీసర్ నవీన్ ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

### అర్హులైన దళితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించండి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): జిల్లాలో అర్హులైన దళితులకు ఇందిరమ్మ ఇళ్లను ఇప్పించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య.. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను కోరారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్తుండగా మార్గమధ్యంలో కాసేపు ఆగారు. జిల్లాలో నిరుపేద దళిత కుటుంబాల స్థితిగతుల గురించి వివరించారు. అనంతరం ఆయనను బాగయ్య సన్మానించారు.

### కొనసాగుతున్న ఇంటింటి వైద్య పరీక్షలు



భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ 30 ఏళ్ల దాటిన వారికి బీపీ, మధుమేహ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వంద శాతం లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ తెలిపారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కామారెడ్డి & ఎల్లారెడ్డి

96034 62494
99122 20764

Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: ఎం. శ్రీనివాస్ : 9704490298
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899